# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ స్థాయి వసతులు కలిగిన నాసిన్ అకాడమీలో పాసింగ్ ఔట్ పారేడ్‌కి హాజరు కావడం సంతోషంగా ఉందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు.**
2. **ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈ రోజు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించి వంద పడకల ఆసుపత్రితో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు.**
3. **ఉగ్రవాదుల చర్యను..... పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని హెూంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.**
4. **ఈ రోజు ప్రపంచ మలేరియా నివారణా దినాన్ని నిర్వహిస్తున్నారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

ప్రపంచ స్థాయి వసతులు కలిగిన నాసిన్ అకాడమీలో పాసింగ్ అవుట్ పారేడ్‌కి హాజరు కావడం సంతోషంగా ఉందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రంలోని "నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ - నాసిన్‌లో 75వ బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారుల పాసింగౌట్ పేరెడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సివిల్ సర్వీస్ అధికారి సేవభావం, దేశ భక్తితో విధులు నిర్వహించాలని తెలియజేస్తూ...

..వాయిస్ .. 38 సెకన్లు

--------------------------

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈ రోజు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ప్రజల నుంచి రచ్చబండ కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులను స్వీకరించనున్నారు. దీంతో పాటు పిఠాపురం నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రితో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపానికి కూడా శంకుస్థాపన చేయనున్నారు. అలాగే గొల్లప్రోలు, చేబ్రోలు సీతారామ స్వామి దేవస్థానాలకు కూడా పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేస్తారు.

---------------------------

పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖపట్టణం వాసి చంద్రమౌళి అంతిమయాత్రలో హోంమంత్రి వంగలపూడి అనిత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కూటమి నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సంధర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ... ఉగ్రవాదుల చర్యను..... పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలిసికట్టుగా పనిచేయాలని ఆమె తెలియజేస్తూ..

..వాయిస్: 30 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో ఈరోజు నుంచి స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు . గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల నమోదుకు అవకాశం కల్పించారు. స్పౌజ్ కేటగిరీ కింద 89,788 మందిని అర్హులుగా గుర్తించారు. పింఛను తీసుకునే భర్త చనిపోతే తదుపరి నెల నుంచే భార్యకు పింఛను అందేలా చర్యలు చేపట్టారు. ఈ నెల 30లోగా వివరాలు సమర్పిస్తే, జూన్ 1 నుంచి పింఛను జారీ చేయనున్నారు.

---------------------------

అన్నా క్యాంటీన్లలో నిర్వహణ పరంగా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని సింగ్‌నగర్ అన్నా క్యాంటీన్‌ను ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.అల్పాహార నాణ్యత ఎలా ఉందో అక్కడికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ఆహారం తిన్నాక క్యాంటీన్‌లో కల్పించిన సౌకర్యాలు, ఆహార శుచి, రుచి ఎలా ఉందో లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలను తీసుకునే ప్రక్రియను పరిశీలించడంతో పాటు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి స్వయంగా అభిప్రాయం తెలియజేశారు.

---------------------------

ప్రపంచ మలేరియా నివారణా దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. మలేరియా వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన కల్పించి... ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించే ఉద్దేశ్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ..... డబ్ల్యూ. హెచ్.ఓ. ... పిలుపు మేరకు 2008వ సంవత్సరం నుండి ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఆఫ్రికాలోని నైజీరియా దేశ రాజధాని అబూజాలో 2001 ఏప్రిల్ 25వ తేదీన ఆఫ్రికన్ యూనియన్ దేశాలు సమావేశమై... ఆరోగ్య రంగాన్ని మెరుగుపరిచేందుకు తమ వార్షిక బడ్జెట్లో కనీసం 15 శాతం మొత్తాన్ని కేటాయించాలని తీర్మానించాయి. ఏప్రిల్ 25 న జరిగిన ఆ తీర్మానాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు

---------------------------

బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అభ్యర్థులందరికీ ఆన్‌లైన్‌లో ఉచితంగా డీఎస్సీ కోచింగ్ అందిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. ఇందుకోసం శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ఆచార్య యాప్‌ను రూపొందించామని, రికార్డు వీడియోల ద్వారా ఉచిత కోచింగ్ కార్యక్రమం నిర్వహించనున్నామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీసీ అభ్యర్థులు ఎక్కువ మంది టీచర్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉచిత కోచింగ్ కేంద్రాలు నిర్వహించామన్నారు. ఈ శిక్షణ కాలంలో

నెలకు 15 వందల రూపాయల ఉపకారవేతనంతో పాటు మరో మెటీరియల్‌కు మరో వెయ్యి రూపాయలు అందించామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఆన్‌లైన్‌లో ఉచిత కోచింగ్ అందిస్తామని మంత్రి తెలియజేస్తూ....

...వాయిస్.. 29 సెకను

---------------------------

మలేరియా నియంత్రణ మనందరి బాధ్యత అని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినాన్ని పురస్కరించుకుని ఈరోజు ఒంగోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారితో మలేరియా నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ఏడాది మలేరియా నివారణ మనందరి బాధ్యత అన్న నినాదంతో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ సౌకర్యాలు, చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయని వివరిస్తూ....

..వాయిస్: 36 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి వి.ఎస్.ఎమ్.రాజు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

..వాయిస్.... 27 సెకన్లు....

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================